క్లుప్తంగా

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న అందె నాసరయ్య

మార్కాపురం: ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో మద్దెల పద్మ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి షేక్ ఖాశిం, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఎన్ఎంల దౌర్జన్యాలు అరికట్టాలని, వారు చేయాల్సిన పనులు ఆశాలపై రుద్దుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సునీత రోజ్లిన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన ప్రజాప్రతినిధులు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

కంభం: నూతన తహసీల్దార్‌గా వి.కిరణ్ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మంగళవారం ఎంపీపీ భర్త చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నల్లబోతుల రామ్మూర్తి, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద సలీం, వైఎస్సార్ సీపీ నాయకుడు డిష్ బాబు మర్యాద పూర్వకంగా కలిసి పూల మాల, శాలువాతో సత్కరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని నూతన తహసీల్దార్ తెలిపారు.

నీమాయిల్‌తో పల్లాకు తెగులు నివారణ



పంటను పరిశీలిస్తున్న ఏఓ మహ్మద్

అర్ధవీడు (బేస్తవారిపేట): మినుము పంటలో పల్లాకు తెగులు నివారణకు నీమాయిల్ 500 ఎంఎల్, థయోమిథియాన్ 250 గ్రాములు, 500 గ్రాములు ఫార్ములా-4 ఎకరా పొలానికి పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి షేక్ మహ్మద్ అన్నారు. మంగళవారం మండలంలోని నారాయణపల్లెలో పంట పొలాలను ఆయన పరిశీలించారు. పంట వేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు ఫారం ఆర్‌బీకే సిబ్బందికి అందించాలని తెలిపారు. కౌలు రైతులు తమ దరఖాస్తులను వీఆర్వోలకు అందించాలని కోరారు. ఆర్‌బీకే సిబ్బంది, వీఏఏలు పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, మౌనిక పాల్గొన్నారు.

తప్పుచేస్తే ఏ శిక్షకైనా సిద్ధమే

- బోడపాడు సర్పంచ్ రమణారెడ్డి



మాట్లాడుతున్న రమణారెడ్డి

మార్కాపురం రూరల్: తాను సర్పంచ్ పదవిని అడ్డుపెట్టుకుని భూ అక్రమాలకు పాల్పడినట్లుగా తనపై నిరాధార ఆరోపణలు చేయడాన్ని బోడపాడు సర్పంచ్ రమణారెడ్డి ఖండించారు. తమ గ్రామానికే చెందిన తన బంధువులు కొందరు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ధర్నా చేయడంపై మంగళవారం స్పందించారు. కుటుంబ సమస్యను అక్రమ వ్యవహారంగా చూపడం సరికాదని, తన మామ ఆమె కూతురు కోసం ఇచ్చిన భూమిని ఎలా ఆక్రమించుకుంటానని ప్రశ్నించారు. గడచిన ఐదేళ్లలో తాను అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎవరి భూములనైనా ఆక్రమించినట్లయితే ఆధారాలతో సహా నిరూపించాలని సవాల్ చేశారు. తాను తప్పు చేసినట్లు తేలితే ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నానని రమణారెడ్డి స్పష్టం చేశారు.

జిల్లా అభివృద్ధికి కేంద్రం కృషి




మాట్లాడుతున్న శివారెడ్డి

మార్కాపురం: జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రకాశం జిల్లాను వెనుకబడిన జాబితాలో చేర్చి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిందన్నారు. కరువు జిల్లాగా ప్రకటించినందున ప్రత్యేక నిధులు వస్తాయని, జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్, మార్కాపురం ఇన్‌చార్జి కృష్ణారావు, ఎన్.శ్రీనివాసరెడ్డి, డి. చంద్రశేఖర్, అమరసింహం, శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎన్నికల కోలాహలం



కొనకనమిట్ల జెడ్పీ పాఠశాల



గొట్లగట్టు కేజీబీవీలో ఎన్నికల నోటీస్

- 8న మార్కాపురం నియోజకవర్గంలో 287 పాఠశాలల్లో ఎన్నికలకు ఏర్పాట్లు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా పేరెంట్స్ కమిటీలు
- కూటమి అధికారంలోకి రావడంతో రాజకీయ వేదికలుగా విద్యాలయాలు

కొనకనమిట్ల:

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటు చేసి నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేశారు. ఇటీవల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పేరెంట్స్ కమిటీలను మేనేజింగ్ కమిటీలుగా మార్పు చేసి ఈ నెల 8న పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసింది. ఆ మేరకు ఇటీవల షెడ్యూల్ విడుదల చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల వద్ద మేనేజింగ్ మానిటరి కమిటీ ఉత్తర్వులు నోటీసు బోర్డుల్లో ఉంచారు. తల్లిదండ్రుల ఓటరు జాబితాను పాఠశాలల హెచ్ఎంలు సిద్ధం చేశారు. కమిటీ నియామకం ఏకగ్రీవం కాకపోతే చేతులెత్తే పద్ధతిలో లేదా రహస్య ఓటింగ్ ద్వారా ఎన్నిక నిర్వహించనున్నారు.

స్కూళ్లు.. రాజకీయ వేదికలు

గత ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా తల్లిదండ్రుల కమిటీలు ఏర్పాటు చేయగా ఈసారి అధికార టీడీపీ నేతలు ఎలాగైనా సరే తమ వారినే మేనేజింగ్ కమిటీ చైర్మన్‌గా నియమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతిపక్ష నేతలు కూడా పాఠశాలల మేనేజింగ్ కమిటీ ఎన్నికల్లో తమవారిని నిలబెట్టేందుకు సిద్ధమవుతున్నారు. మార్కాపురం నియోజకవర్గంలో మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు మండలాల్లో 287 పాఠశాలల్లో 27105 మంది విద్యార్థులు ఉన్నారు. 287 పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు 8వ తేదీన గురువారం పాఠశాలల మేనేజింగ్ కమిటీ నియామకాలు చేపట్టనున్నారు.

ఎన్నికల విధానం ఇలా..

పాఠశాలల యాజమాన్య కమిటీలో సభ్యుల ఎన్నికకు తల్లిదండ్రులు చేతులెత్తే పద్ధతి, అది కుదరని పక్షంలో రహస్య ఓటింగ్‌ను అనుసరించనున్నారు. ఒక్కో తరగతికి సంబంధించి ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటారు. ఆ విధంగా అన్ని తరగతులకు సంబంధించి ఎంత మంది సభ్యులు ఉంటారో వారిలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. మిగతా వారు సభ్యులుగా ఉంటారు. వీరితో పాటు కమిటీ కన్వీనర్‌గా పాఠశాల హెచ్ఎం, మరో ఆరుగురు ఎక్స్ అఫిషియో సభ్యుల్లో పాఠశాల ఉపాధ్యాయుడు, అంగన్‌వాడీ కార్యకర్త, పంచాయతీ వార్డు మెంబర్, ఏఎన్ఎం, పూర్వ విద్యార్థి ఉంటారు. కమిటీ పదవీ కాలం రెండేళ్లు కాగా తల్లిదండ్రులకు ఓటు హక్కు ఉంటుంది. ఇదిలా ఉంటే పలువురు ఆశావాహులు ఇప్పటి నుంచే కమిటీ నియామకం కోసం తమ వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. 8వ తేదీ ఉదయం పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశం అనంతరం కమిటీ నియామకం చేపట్టనున్నారు. ఎన్నికైన వారితో ప్రమాణస్వీకారం చేయించి, తొలి సమావేశం నిర్వహిస్తారు. ఎన్నికైన సభ్యులు పాఠశాలలను పర్యవేక్షించనున్నారు.



వెంకటేశ్వరరెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

ఎంపీపీకి పితృవియోగం

గిద్దలూరు రూరల్: స్థానిక ఎంపీపీ కడప లక్ష్మి తండ్రి చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి(60) పాదలకుంటపల్లెలోని ఆయన స్వగృహంలో సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి, మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబులు మంగళవారం వేర్వేరుగా ఆయన భౌతిక దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. కేపీ వెంట మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ రంగారెడ్డి, పులి రామకృష్ణారెడ్డి, కావేటి ఈశ్వర్‌నాయుడు, కృష్ణారెడ్డి ఉన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న డీఎల్‌డీఓ సాయికుమార్

బేస్తవారిపేట: సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డివిజనల్ లెవల్ డెవలప్‌మెంట్ అధికారి సాయికుమార్ సూచించారు. మండలంలోని పెద్ద ఓబినేనిపల్లె, నేకునాంబాద్ సచివాలయాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయాల్లో పని చేయని ప్రింటర్స్, కంప్యూటర్స్ సమాచారం ఎంపీడీఓకు పంపాలని సూచించారు. వారం రోజుల్లో పూసలపాడులో ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్ నమోదు స్పెషల్ క్యాంపునకు మండలంలో షెడ్యూల్ వేసి జిల్లా కేంద్రానికి పంపాలని ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రాష్ట్ర స్థాయిలో అనుమతి తీసుకున్న తర్వాతనే ఆధార్ నమోదు ప్రారంభించాలని తెలిపారు. సచివాలయాల్లో మూవ్‌మెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈఓపీఆర్డీ పి.రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్ల వేతనాలు చెల్లించాలి



వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న వర్కర్లకు వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య కోరారు. శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు 7 నెలల నుంచి జీతాలు చెల్లించక పోవడంతో పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్యాలయం నిర్వాహకుడికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు అందక ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రభుత్వం వారికి జీతాలు చెల్లించాలని కోరారు. సీఐటీయూ నాయకులు, శానిటేషన్ వర్కర్ల యూనియన్ నాయకులు సమీరా, పుష్ప, వై.రాధ, జహీరా, మౌలాబీ పాల్గొన్నారు.

జ్వరపీడితుల వివరాలు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పృధ్వీరాజ్

బేస్తవారిపేట: జ్వరంతో వైద్యశాలకు వచ్చిన వారి వివరాలు నమోదు చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.పృధ్వీరాజ్, కావ్య అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రైవేట్ డాక్టర్లు, బీహెచ్ఎంఎస్, బీఏఎంఎస్, ఆర్ఎంపీ, పీఎంపీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డెంగీ కేసులపై ఎలీషా టెస్ట్ మనకు అందుబాటులో లేనందున వచ్చిన రోగులను భయభ్రాంతులకు గురిచేయవద్దని, పీహెచ్‌సీ ఫీల్డ్ స్టాఫ్‌కు సమాచారం అందించాలని కోరారు. సీహెచ్ఓ, హెల్త్ సూపర్‌వైజర్స్, ఏఎన్ఎం, ఎంఎల్‌పీలకు ఫోన్ చేసి ఒక ప్రాంతంలో ఎక్కువగా జ్వరం కేసులు వస్తుంటే వివరాలు తెలపాలన్నారు. వైద్యం చేసేటప్పుడు యాంటీబయాటిక్స్, కార్టిజోన్స్ అధిక మోతాదులో వాడకూడదని, అలా వాడినప్పుడు రోగికి ఏదైనా జరగకూడనిది జరిగితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి



మాట్లాడుతున్న సుధామారుతి



గొట్లగట్టులో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పొదిలి: శిశువులకు తల్లిపాలు అమృతంతో సమానమని, బిడ్డ జన్మించినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టిస్తే రోగ నిరోధక శక్తి మెరుగ్గా ఉంటుందని సీడీపీఓ సుధమారుతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కాటూరివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. పాలు సమృద్ధిగా ఉండేందుకు తీసుకోవాల్సిన ఆహారం, పిల్లలకు పాలు ఇచ్చే పద్ధతుల గురించి తల్లులకు వివరించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాలు చేయించుకుంటే ప్రోత్సాహకాలు అందుతాయన్నారు. సూపర్‌వైజర్ సుభాషిణి మాట్లాడుతూ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు ఆహార నియమాలు, టీకాలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పోషకాహారాలతో ఏర్పాటు చేసిన డిజైన్లు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఝాన్సీరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

కొనకనమిట్ల: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత సూచించారు. మంగళవారం గొట్లగట్టులో తల్లిపాల వారోత్సవాలు వేడుకగా నిర్వహించారు. పలువురు గర్భిణులకు పోషకాహారం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలేరమ్మతల్లి ప్రతిష్ఠ ఉత్సవాలు



ముస్తాబైన పోలేరమ్మతల్లి ఆలయం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. బుధవారం గంగానయనం, గోపూజ, గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, బుధ, గురువారాల్లో గ్రామోత్సవాలు, పోలేరమ్మ, పోతురాజుస్వామి, విమాన గోపురశిఖర, కలశ ప్రతిష్ఠను కారంచేటి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తామని వివరించారు. భక్తులకు మూడు రోజులపాటు అన్నసంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఆసీఫ్ ఖాన్



తువ్వపాడులో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ

మార్కాపురం టౌన్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని న్యాయవాది ఆసీఫ్‌ఖాన్ అన్నారు. మంగళవారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు సచివాలయాల్లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల మూడు కొత్త చట్టాలను అమలులోనికి తీసుకొచ్చిందని వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఐపీసీ, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అదినియంను తీసుకొచ్చినట్లు వివరించారు. సచివాలయాల్లో ప్రభుత్వ సేవలు లభించకపోతే, న్యాయపరమైన ఇబ్బందులు వస్తే మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.

కొత్త చట్టాల గురించి తెలుసుకోవాలి

కొనకనమిట్ల: కొత్త చట్టాల గురించి ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ మాధవరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తువ్వపాడు గ్రామంలో పర్యటించి శాంతి భద్రతలు, కొత్త చట్టాలు, న్యాయపరమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావులేకుండా కలిసిమెలసి ఉండాలని సూచించారు. అనంతరం జాతీయ రహదారిపై కొనకనమిట్ల సమీపంలో పలు వాహనాలు తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు.

వక్ఫ్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించం

మార్కాపురం: ఎన్‌డీఏ ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ ముస్లింల హక్కులను హరిస్తోందని మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేత సయ్యద్ జావీద్ అన్వర్ విమర్శించారు. మంగళవారం ఆయన మార్కాపురంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని హరించేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం కొత్త చట్టం తేవాలని కుట్ర చేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కు తీసుకోకుంటే ముస్లింల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ముస్లిం సమాజ అభివృద్ధికి ప్రభుత్వాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గోడను తొలగించేందుకు విఫలయత్నం



స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

కంభం: దారికి అడ్డంగా రేకుల షెడ్డు వేశారని స్థానికులు ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు.. స్థానిక వై.జంక్షన్ సమీపంలో ఇరిగేషన్ కాలువ పక్కన రేకుల షెడ్డు వేయడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని స్థానికంగా నివాసం ఉండే మహిళలు, ప్రజలు అక్కడికి వచ్చి గడ్డపారలతో గోడలు పగలగొట్టేందుకు ప్రయత్నించగా యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అనుమతులు లేకుండా పగలగొట్టడం నేరమని అధికారుల ద్వారా చర్యలు తీసుకోవాలని చెప్పడంతో వారు వెనుదిరిగారు. అనంతరం మహిళల పోలీసుస్టేషన్‌కు వెళ్లారు.

గృహ ప్రవేశానికి హాజరైన 'ఉడుముల'



కాసును అభినందిస్తున్న ఉడుముల శ్రీనివాసులరెడ్డి

కొనకనమిట్ల: మండలంలోని బచ్చలకూరపాడు పంచాయతీ మెట్టువారిపల్లి గ్రామంలో 'కాసు' చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎన్ఆర్ఐ కాసు వెంకటేశ్వరరెడ్డి నూతన గృహ ప్రవేశానికి మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాసు మాట్లాడుతూ.. తమ చారిటబుల్ ట్రస్ట్ తరఫున మండలంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గృహ ప్రవేశంలో పాల్గొన్న వారిలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు విష్ణుశ్రీరెడ్డి, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, మాజీ ఎంపీపీ మాదాల బ్రహ్మయ్య, బత్తుల రామకృష్ణారెడ్డి, రామిరెడ్డి, ఈర్ల బాలవెంకటేశ్వర్లు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

దర్శి: అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు మంచా నాగార్జున కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘ జిల్లా కార్యదర్శి వి. బాలకోటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పోతవరంలో ఆత్మహత్య చేసుకున్న ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కౌలు రైతు కుటుంబాన్ని ఆయన మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాలకోటయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలతో ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగాయన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు అప్పులపాలవుతున్నారన్నారు. అప్పులు తీర్చలేక భూమిని వదలలేక మానసిక ఒత్తిడికి గురైన రైతులు బాధతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. ఇవి ప్రభుత్వ హత్యలే అని మండిపడ్డారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని, ప్రభుత్వ విధానాలపై పోరాడి వ్యవసాయ రంగాన్ని బతికించుకోవడం కోసం పోరాడాలని రైతులను కోరారు. ఏపీ రైతు సంఘ మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు తాండవ రంగారావు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ముండ్లమూరు: ఈ నెల 8వ తేదీన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 52 ప్రాథమిక, ఎనిమిది ప్రాథమికోన్నత, ఎనిమిది ఉన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. 68 పాఠశాలల్లో ఎన్నికల సందర్భంగా ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందుగా పోలీసుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని తగిన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నిక సందర్భంగా ఓటు చేసేందుకు వచ్చే సమయంలో ఆధార్‌కార్డు, ఓటరు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. సమస్యాత్మక పాఠశాలల వివరాలను ముందుగా తెలియజేయాలన్నారు. సమావేశంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.